శ్రీ

రాంభట్ల వేంకటీయము

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

(పద్యకావ్యం)

"అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ

జననం : 24-11-1900

నిర్యాణం : 16-09-1981

జననం : 15-12-1910

నిర్యాణం : 28-12-1995

కీ॥ శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు, కీ॥ శే॥ రాంభట్ల సూర్యకాంతమ్మ

శ్రీ

"రాంభట్ల వేంకటేయము"

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుష్ఠిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

(పద్య కావ్యం)

ధాత్రీ త్రిదశోత్తమ! భూ
పాత్రా లా! సకల విద్యాధర సన్నుత
విలస
జ్ఞాన త్రాణ్వ మూర్తి! ద
త్తాత్రేయాచార్య! నన్ను
దయచూడగదే

ఇట్లు
రాంభట్ల

రచన :

"అష్టావధాని" చి॥రాంభట్ల పార్వతీశ్వర శర్మ

(B.Sc. Micro Biology Final)

Dr. V.S. Krishna Govt. Degree College,

VISAKHAPATNAM

శ్రీ రాంభట్ల వేంకటీయము

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుప్పిలి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

"అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ

ప్రథమ ముద్రణ : 24, నవంబరు 2007 (కార్తీక శుద్ధ పౌర్ణమి)

ప్రతులు : 500

ప్రకాశకులు : "రాంభట్ల వేంకటరావు" మెమోరియల్ ట్రస్ట్

సర్వస్వామ్యాలు : రచయితవి

ముఖచిత్రం : శ్రీ డి.వి. రమణ

వెల : అమూల్యము

ప్రతులకు :

"అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ

S/o. ఆర్.ఎల్.ఎన్. సోమయాజులు

డో.నెం. 12-132, సత్యానగర్,

చినముషిడివాడ, విశాఖపట్నం - 531173

ఫోన్ : 9247859580, 9393122394, 9391220405

ముద్రణ :

ఎస్.వి.ఎస్. గాయత్రి ఆఫ్‌సెట్ ప్రింటర్స్

విశాఖపట్నం.

సెల్ : 9247426486

అంకితం



ఉ॥ ఆతనిమించినట్టి గురు, డాతనిఁ బోలిన దేశసేవకుం
డాతని కంటె జ్ఞాని, మఱి యాతని మించినవాడులేడిలన్!
భూతల ధాత, వైద్యకులభూషణుడౌ కవి చక్రవర్తికిన్
ప్రీతిగనిత్తు నీరచన “వేంకటరావ్యన” కంకితమ్ముగా!!

- మీ ముని మనుమడు

“అష్టావధాని” చి॥ రాంభట్ల పార్వతీశ్వర శర్మ

మున్నుడి

"పుణ్యశ్లోకస్య చరితముదాహరణమర్హతి" అని ఆర్యోక్తి. పవిత్రుల చరిత్ర నిత్యస్మర్తవ్యమని తాత్పర్యం. కీ.శే. రాంభట్ల వేంకటరావు గారు అట్టి కోవకు చెందిన మహాత్ములు.

శ్రీ వేంకటరావు గారు జీవితాన్ని వైద్యవృత్తికంకితం చేసుకొని కుప్పిలి డాక్టర్‌గా పేరు ప్రతిష్ఠలు సంపాదించు కొన్నవారు. అనల్పమైన ప్రతిభతో ఆశుకవిత్వ ప్రదర్శనంచే కవిరాజుగా కీర్తిగాంచినవారు. ఆ రోజుల్లో సమాజంలో హెచ్చు తగ్గులు లేవు. అందరు సమానులే అన్న విశాలమైన దృక్పథాన్ని ప్రదర్శించిన ఉత్తమ సంఘ సంస్కర్తగా పలువురి ప్రశంసలందుకొన్నవారు. గాంధీగారి పిలుపును గ్రహించి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని దేశభక్తిని లోకానికి చాటి చెప్పినవారు. గృహస్థుగా కుటుంబ సభ్యుల అభ్యుదయానికి పాటుపడి ఆదర్శ జీవితం గడిపినవారు. "స జాతో యేన జాతేన యాతి వంశః సమున్నతిమ్" అన్న వాక్యానికి లక్ష్యంగా నిలిచి రాంభట్ల వారి వంశానికి ప్రశస్తి తెచ్చినవారు. అట్టి మహనీయుని చరిత్రని సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచేటట్లు, భావితరాల వారికి గత వైభవాన్ని వివరించేటట్లు చిరంజీవి రాంభట్ల పార్వతీశ్వర శర్మ పద్య కావ్యంగా సంతరించడం విద్వత్ప్రశంసార్హం.

చిరంజీవి పార్వతీశ్వర శర్మ అప్పుడప్పుడు ఆశుకవిత ప్రదర్శిస్తూ, అక్కడక్కడ అష్టావధానం చేస్తూ, సాహిత్యలోకంలో తన స్థితిని పెంచుకొంటున్నాడు. తన ప్రపితామహుల జీవిత చరిత్రను సంగ్రహ పద్యకావ్యంగా రచించడం అస్మదాదులకు పరమహర్షదాయకం. కావ్యం చిన్నదే గాని సర్వతోముఖ ప్రతిభావంతులైన శ్రీ రాంభట్ల వేంకటరావు గారి వ్యక్తిత్వాన్ని సూత్రప్రాయంగా ఆవిష్కరిస్తోంది.

ఈ మధురకృతిలోని పద్యాలు సరళంగా సర్వజన సుబోధంగా సుమనో మనోహరంగా రచింపబడ్డాయి. మత్తకోకిల మధురాలాపం "అక్కరమ్ములనాదిగా మటి హద్దు పద్దుల నేర్చుచున్" అనే పద్యంలో

ఆస్వాద్యమౌతోంది. "తంపిని మరిగించు పాలు, దంపుడు బియ్యపుటన్నము" అనేవి ఆనాటి ప్రజల ఆహారపద్ధతిని చక్కగా సూచిస్తున్నాయి. శ్రీ వేంకటరావు గారి విశిష్టత "మంత్రముచే విషమును" అనే కంద పద్యంలో మధురంగా నిరూపింపబడింది. "అంధకారముఁబాపి యవని మేల్కొల్పంగ...., మట్టిగోడలె కాని మమతానురాగాల...." అనే సీస పద్యాలు కవి యొక్క రచనా ప్రాగల్భ్యాన్ని పట్టి చూపుతున్నాయి.

చిరంజీవి వర్ధిష్ణువు రాంభట్ల పార్వతీశ్వర శర్మ ప్రాచీన సంస్కృతాంధ్ర మహా కవుల సాహిత్యాన్ని అధ్యయనం చేసి వ్యుత్పన్నతని పెంచుకొని ఇతోధికంగా మధురకృతులు రచించాలని హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను. పాఠకులు ఈ మధురకృతిని చదివి ఆస్వాదించి కీ.శే. రాంభట్ల వేంకటరావు గారి ఆశయాలని అలవరచుకుంటారని ఆశిస్తున్నాను.

శుభం భూయాత్

వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి

విశ్రాంతాచార్యులు, తెలుగు శాఖ, A.U.

3-11-2007

ఆశీస్సు

చిరంజీవి రాంభట్ల పార్వతీశ్వరశర్మ ఇంటర్ విద్యార్థిగా అవధానం చేసి బాలావధానిగా పేరు తెచ్చుకున్నాడు. పద్యం అల్లడం అలవడిన ఆ చిరంజీవి ఆ కళను తమ ముత్తాత గారైన శ్రీ రాంభట్ల వేంకటరావు గారి సంగ్రహ జీవిత చరిత్రను వ్రాయడానికి వినియోగించి తాను పునీతుడై తన వంశాన్ని పునీతం చేసాడు. తన తల్లికి, తండ్రికి కూడా శ్రీ వేంకటరావుగారు తాతగారు కావడం విశేషం. బంధువులందరూ ఆ తాతగారి జీవిత విశేషాలు చెప్పగా విని ఆయన 108వ పుట్టిన రోజుకి అష్టోత్తర శత పుష్పాలతో ముత్తాత గారిని అర్చించాలన్న అత్యంత పవిత్రమైన భావనతో ఈ కావ్యం వ్రాయడం అభినందనీయం. తల్లిదండ్రులు బంధుకోటి మిత్ర మండలితో పాటు స్వర్గంలో ఉన్న ఆ మహానుభావుడు కూడా మహదానంద భరితులౌతారు ఈ కావ్యం విని.

శ్రీ కాశీవిశ్వేశుని స్తుతితో ఆరంభించి, శ్రీ వక్రతుండుని, సప్తశైలేశ్వరుని గాయత్రీ మాతను కొలుస్తూ - ఇలవేల్పుగా వెలసిన వేంకమాంబగారికి ప్రణమిల్లి కథారంభం చేసాడు.

కథారంభం 'అది ఆంధ్ర విజయనగరం' అంటూ హంపీ విజయనగరం కాదని స్పష్టపరిచాడు.

శ్రీ వేంకటరావు గారి పుట్టుక, విద్యాభ్యాసం, వీరి గాయిత్రీ జప విశేషాలు, వివాహపు వేడుకలు, వైద్య విద్యాపేక్ష వరుసగా వర్ణించాడు. వేంకటరావుగారు కుప్పిలి డాక్టరు గారిగా పేరు ప్రఖ్యాతలు పొందారు. తాతగారిని ఈ మునిమనుమడు "వైద్య ఫల్గుణుండు' అని సంబోధించాడు.

వైద్యుడై ఆయన - 'కాలు మోపెను కుప్పిలి గడ్డ'పైన వైద్యనారాయణుండయ్యె భవ్యగతులు. వైద్యవృత్తిలో తాతగారి హస్తవాసికి ఉన్న ప్రాముఖ్యం "తన రాక తెలిసినంతనె" అన్న పద్యంలో చక్కగా వివరించాడు.

తమ తాతగారు ఆశుకవి చక్రవర్తి అనీ తెలుగు, సంస్కృత భాషల్లో చాటు రచనా సిద్ధహస్తులనీ, విద్యార్థుల కోసం బాపు చరిత్రను దసరా పద్యాలుగా వ్రాసి యిచ్చారనీ 'క్షీర సాగర మథనము' అనే పేర ద్వ్యర్థి కావ్యం వ్రాసారనీ పేర్కొన్నాడు.

గాంధీగారి భావజాలాన్ని గౌరవించి 'మాలపల్లికేగి వైద్యం చేసేవారనీ, తమ పిల్లల పెళ్ళిళ్ళలో – కుల విచక్షణ పాటించక ఊరి వారందరికీ ఏక పంక్తి భోజనాలేర్పాటు చేసిన సాంఘిక సంస్కర్త అనీ చక్కగా వివరించాడు.

ఈ కవి కుమారుడు వ్రాసిన 108 పద్యాల్లో, ఒక సుగంధి, ఒక ఉత్సాహ, ఒక మత్తకోకిల కూడా సందర్భానుసారంగా రచించి తనకు గల పద్య రచనా నైపుణిని ప్రదర్శించాడు.

తాతగారి ఆహార్య సంపదని, రూప సౌభాగ్యాన్ని ఒక ఉత్పలమాలలో – 'ఖద్దరు వస్త్రధారియయి' అని వర్ణించి తన్మయుడయ్యాడు. ఈ కావ్యంలో తమ ముత్తాత్తగారు కట్టిన ఇల్లును "మట్టి గోడలె గాని మమతానురాగాల నింపి కట్టిన మహానిలయమద్ది" అంటూ వర్ణించి పార్వతీశ్వరశర్మ తన కవిత్వ పటుత్వాన్ని ప్రదర్శించాడు.

వీరి ఇంటి పేరు రాంభట్లవారు ఏనాటి నుండో రామభక్తి సామ్రాజ్యాన్ని ఆశ్రయించి అర్చిస్తున్నవారు. రామభక్తి వారిలో నరనరాల ప్రవహిస్తూ ఉంటుంది. అందుకే జీవితంలో అడుగడుగునా రామస్మరణను మరువరువారు.

శ్రీ వేంకటరావుగారు కూడా

తప్పొప్పులు రామేచ్ఛగ – తలచారనీ

'ఇన వంశరామయ్య హృదయమ్ము గలవానిగా వర్తించడం

భారతరామాయణముల పారాయణ చేసి

గొప్ప పౌరాణికుడై వర్ధిల్లడం

రామనామమే సాధనమంచు నెంచి మనసార జపించుచు వారి జీవితం పరిసమాప్తి అయిందని వర్ణించడం ఔచితీభరితం.

రాంభట్ల వంశవృక్షం – నూరు పువ్వులతో వేయి ఫలాలతో వర్ధిల్లుతూ ఉందన్న సమాచారం ముత్తాత గారికి పద్యరూపంలలో అందించి పరవశించిన పార్వతీశ్వరశర్మ అభినందనీయుడు.

కావ్యం చిన్నదే అయినా కవితా విషయకంగా గొప్పగా తీర్చాదు పార్వతీశ్వర శర్మ. ముందు ముందు మరిన్ని కావ్యాలు వ్రాసి బాలకవి ప్రౌఢకవి కావాలని ఆశీర్వదిస్తూ....

– మలయవాసిని.

విశ్రాంతాచార్య, తెలుగు శాఖ, A.U.

"పండితా"శీర్వచనం

"కుప్పిలి డాక్టరు" గారు అనుపేరుతో ఆ పరిసర గ్రామాలన్నిటిలో మంచి వైద్యునిగా, సమాజ సేవకునిగా, పండితునిగా, స్వాతంత్ర్యసమర యోధునిగ కీర్తి గడించిన మహోన్నతమూర్తియైన తన ప్రపితామహులైన కీ॥శే॥ రాంభట్ల వేంకటరావు గారి గురించి, వారి 108వ జన్మదిన మహోత్సవము జరుపుచు అందులో భాగంగా 108 పద్య పుష్పాలతో అంజలి ఘటిస్తున్న చి॥ పార్వతీశ్వరశర్మ కృషి అభినందనీయము. పండిత మండలికి హర్షదాయకము.

తెలుగు సాహిత్య రంగములో నూనూగుమీసాల నూత్న యౌవన దశలోనే అవధానిగ తన ప్రతిభనుచాటుతూ అందరిమన్ననలను అందుకొంటున్న చి॥ పార్వతీశ్వర శర్మ ఈ చిన్న వయసులోనే పద్యకావ్యమును రచించుట మిక్కిలి ప్రశంసనీయము.

పద్య కావ్యమునకు నాయకుడు అగు వేంకటరావుగారు బహుముఖ ప్రజ్ఞాశాలి. వారి ఆశీస్సులు ఎలాగూ ఉన్నాయి. మరి ఈ చిన్నారి యొక్క సాహసము కూడా తక్కువ పాటిది కాదు. వెరసి ఈ చిన్న పొత్తము పాఠకుల మనసులను హత్తు కొంటుందనడంలో అతిశయోక్తి లేదు.

"అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అనునట్లు ఈ కవిలో కావ్య నిర్మాణ సామర్థ్యం తగుపాళ్లలో ఉంది - రాను రానూ అభివృద్ధి చెందుతుంది. అలవోకగా అవధానాలను విజయవంతంగా నిర్వహిస్తున్న ఈ పార్వతీశానికి "వాగర్థముల"పై పట్టుగాని ధారాశుద్ధిగాని, తక్కువ మోతాదులో లేదు. మచ్చుకి కొన్ని పద్యాలు చూడండి.

కథా నాయకుడైన శ్రీ వేంకటరావుగారి పుట్టుకతో వచ్చిన రాగమును గూర్చి చిన్న కంద పద్యములో హృద్యముగానీతడు వర్ణించినతీరు "శ్రీకరము" మరియు "శ్లోకమును" అయి లోకోత్తరమయినది. "ఆనాడాంగ్ల పరీక్ష" (20 వ పద్యము) జ్యోతిశ్శాస్త్రమునందు భాస్కరుడు (23వ పద్యం) మొదలగు పద్యములు ఈ కవి యొక్క ధారాశుద్ధికి నిదర్శనములు.

"కనుచూపుమేరలో కడలి దర్శనమిచ్చి" అను

45వ పద్యములో, మరల అంధకారము బాపి అవని మేల్కొల్పంగా అను 47 వ పద్యములో ఈయన వర్ణనా వైవిధ్యము ప్రకటితమగుచున్నది. అలాగే 51 వ పద్యము "మట్టిగోడలెగాని మమతాను రాగాల నింపి కట్టిన మహా నిలయమద్ది" అనే పద్యము మంచి భావగర్భితమై ఈ కావ్యమునకే తల మానికమై నిలచినది.

అక్కరమ్ములనాదిగా (65వ పద్యము) అను మత్తకోకిలలో శ్రీ వేంకటరావుగారి వాత్సల్య వైభవము చక్కగా వివరింపబడినది. ఆ భావమే మత్తకోకిల యొక్క గాన మాధుర్యాన్ని తలపింపజేస్తున్నది.

ఈ విధముగా ఎంతయునూ రసరమ్యముగా సాగినదీరచన. ఈ "కవి" భావి కాలములో ఇంకనూ మిక్కిలి కృషి సల్పి ఆంధ్ర కవి బృందములో సమున్నత స్థానమునందగలడు. ఆ గాయత్రీమాత యొక్క ఆశీస్సులు ఈ కవిని బహుముఖ ప్రజ్ఞాశాలిగ తీర్చిదిద్దగలవు.

అనేక శుభాశీస్సులతో

నేమాని రామజోగి సన్యాసిరావు

అష్టావధాని

12-5-59, బసివిరెడ్డిపేట,
కొవ్వూరు-534350 (ప.గో. జిల్లా)
4-11-2007

చం॥ "కులమునకున్ ప్రదీపమన కూరిమివెల్గుల నింపినట్టియు
జ్వలమతి రామభట్ల కుల చంద్రుడు వేంకటరావు పేరిటన్
సలలిత రీతివ్రాసె నొక చక్కని పొత్తము పార్వతీశ్వరుం
డలరుత వాని యీ కృషి సమంచిత దీప్తి బుధప్రశస్తమై"

[illegible]

సోమయాజులు - సోమయాజులు
(తాత) (మనుమడు)

(శ్రీ రాంభట్ల వేంకట సోమయాజులు)

మా తాతగారైన బ్ర॥శ్రీ॥ రాంభట్ల వేంకట సోమయాజులు గార్ని గూర్చి మా యింట గల ఐతిహ్యము :

రాంభట్ల వేంకట సోమయాజులు గారు సోమయాగము చేసిన యజ్వి మాత్రమే కాదు. శ్రీ విద్యాపూర్ణ దీక్షాపరులు, పరమహంస పరివ్రాజక శ్రీశ్రీశ్రీ బోధానంద భారతి (రాణీ చయనులు) గారి అంతే వాసి పు॥ప॥ శ్రీశ్రీశ్రీ కళ్యాణానంద భారతిగా ప్రసిద్ధులైన (గంటి బాలకామేశ్వర శర్మ) గుంటూరు విరూపాక్ష పీఠాధిపతులు కూడా బోధానంద భారతి గార్కి శిష్యులే.

బోధానందభారతి అవధూత అయి, పీఠమును వదిలి పోయెను. అపుడు ఒక స్వామి విజయనగర సంస్థాన దివాను గారి ప్రోత్సాహముతో ఆ పీఠమును ఆక్రమించుకొని తానే పీఠాధిపతినని భక్తులకు శ్రీముఖములను పంపించసాగెను. ఆ పీఠమంత్రి పీఠము నందు శ్రీచక్రము మొదలగు వస్తువులను దాచి వుంచి, నకలు వస్తువులను ఆ స్వామికిచ్చెను. కళ్యాణానంద భారతికి వానిని అప్పగించి, ఆయనచే కూడా విరూపాక్ష పీఠాధిపతిగా శ్రీముఖలములనిప్పించెను. ఎవరు పీఠాధిపతులో, బోధానంద భారతికి వారసులో తేల్చుకొనుటకు గుంటూరు కోర్టును ఆశ్రయించిరి. కోర్టువారు యీ తగవు విజయనగరం వెళ్ళి తీర్చుకోవలసిందిగా సూచించిరి. విజయనగరమున అయ్యకోనేరు తూర్పు గట్టున గల పెద్ద ఆంజనేయస్వామి కోవెలలో జరిగిన పండిత పరిషత్తులో దివానుగారి సమక్షంలో శ్రీ "రాంభట్ల వేంకట సోమయాజులు" గారు, కళ్యాణానంద భారతి గారిదే అసలైన "విరూపాక్ష పీఠము" అని నిర్ణయము చేయగా, "కళ్యాణానంద భారతి"ని విజయనగర సభలో "విరూపాక్ష పీఠాధిపతిగా ప్రకటించి పట్టము గట్టిరి.

అంతటి నిత్యసత్యవ్రతులైన శ్రీరాంభట్ల వేంకట సోమయాజులు గారి పుత్రులైన శ్రీ రాంభట్ల వేంకటరావు గారు (మానాన్నగారు) యీ విషయము చెప్పచుండేవారు. ఆ వంశంలోనే జన్మించిన మహనీయుని చరిత్రని పద్యకావ్యంగా నా మనుమడు రాంభట్ల పార్వతీశ్వర శర్మ రచించండం అభినందనీయం.

"దహరానందనాథ"

రాంభట్ల వేంకట సోమయాజులు

శ్రీచక్రపీఠం, హైదరాబాద్

కవి హృదయం

"కన్న తల్లి గుండెవలె ముఖ్యమైనది" అంటూ "అమ్మ" కవితతో కలం పట్టినది నా కరం. అప్పుడు నాకు పదకొండేళ్ళు. తెలుగు సాహిత్యమణి నాకు పునర్జన్మ ప్రసాదించింది అప్పుడే. అలా ఊపిరి పోసుకున్న నా "కవి హృదయం", జల సంక్షోభం, విజయం మనదే, సమరస్థలం, నిరుద్యోగం, జలప్రళయం, ప్రపంచ ఘోష, జల విశాఖ, నేటి కాలేజి, ఏది శాశ్వతం?, నాయనమ్మ, లాంటి అనేక కవితా ఖండికలతో భావకవిత్వానికి ఆకరమైనది. కానీ ఏదో తెలియని "చిన్నతనం" వలన అవి నా అంతరంగానికి మాత్రమే పరిమితమయ్యాయి. వీటితో పాటు ఎందరో ప్రముఖులకు "సన్మాన పత్రాలు"గా కవితా ప్రశంసార్చన చేసిన ఛాయలూ ఉన్నాయి.

అటు ప్రాథమిక విద్యాభ్యాసంతో సంపాదించుకొన్నవి ఛందో జ్ఞానం, వ్యాకరణ పరిపుష్టి అయితే, యిటు యింటిలో మా తాతగారు శ్రీ "రాంభట్ల పార్వతీశ్వర శర్మ" గారు "పద్యకవి" కావడంతో ప్రతిభకు వ్యుత్పన్నత సిద్ధించినట్టైంది. అలా వారిని ఆది గురువుగా తలచి, మరిన్ని విషయాలను నేర్చుకుంటూ, సాగుతున్న తరుణంలో.

తొమ్మిదవ తరగతిలో నన్నాకర్షించిన పాఠ్యాంశం "అష్టావధానం". ఆ పాఠ్యాంశ సారాన్ని బాగా వంట పట్టించుకొన్న నాకు "పద్యవిద్యా సరస్వతి"పై ఆసక్తి, అభిమానం ఆవిర్భవించాయి. పద్యరచనకూతగా ఎంచుకొన్న అంశం "దత్త పది". ఆకాశవాణి, దూరదర్శన్‌లు నిర్వహిస్తున్న సాహిత్య కార్యక్రమంలో యిచ్చే నాలుగు పదాలూ, నాలుగు పాదాలుగా నా నాల్కపై ఆ సరస్వతీ పదాన్ని యుంచి పద్యాన్ని పలికింప జేసాయి. అవధానంపై ఆసక్తితో, ఆ శక్తి సత్కృపతో మొట్టమొదటిసారిగా శృంగవరపు కోటలో అష్టావధానంలో పృచ్ఛకునిగా "దత్తపది" అంశాన్ని నిర్వహించాను. అనేక చోట్ల ప్రముఖుల అవధానాలలో పృచ్ఛకునిగా వ్యవహరించిన పిమ్మట "అమ్మ" ఆశీస్సులతో, అమ్మమ్మల అండదండలతో అదే శృంగవరపు కోటలో శ్రీ ధారగంగమ్మ అమ్మవారి సన్నిధిలో "మొదటి అష్టావధానం" నిర్విఘ్నంగా పూర్తి జేసాను. ఆ తరువాత విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, హైదరాబాద్, కొవ్వూరు తదితర ప్రాంతాలలో "తొమ్మిది" వరకు అవధానాలు చేయగలిగాను. అయితే నేనీ అష్టావధాన పీఠాన్ని అధిష్టించడంలో

మా గురువుగారైన తాతగారి కృషి సుంత మాత్రము కాదు. పృచ్ఛకులు సంధించే అస్త్రాలను ఎదుర్కొనే మెలకువలను అనుక్షణం తెలియజేస్తూ, నన్నీ స్థితికి చేర్చిన ఘనత వారికే చెందుతుంది. నా ప్రతి పద్యానికి తొలి విమర్శకుడు నా సోదరుడు "రాంభట్ల వేంకట్రాయ శర్మ" (అన్నగారు). ఆతని నేపథ్యంలో నా పద్యాలు మరింత శోభను సంతరించుకొనేవి!

అలా అవధాన సుధారస సాగరంలో రసాస్వాదం చేస్తున్నప్పుడు "ధారా శుద్ధి" పెంపొందించుకోవడానికై కావ్యం వ్రాయాలనే అభిలాష కలిగింది. అపుడుదయించిన కావ్యం "ద్రౌపదీ పరిదేవనము". పంచచామర వృత్తంలో, రేఫ ప్రాసముగా సాగినదా పద్యకావ్యం. కానీ, వ్యాసునితో మొదలుగా అసంఖ్యాకంగా మహాకవుల ఘంటములచే విభిన్న కల్పనా చాతుర్యంతో భారత గాథ రచింపబడింది. అదే చరిత్రను వ్రాస్తే అది పోలికకు కీలకం అవుతుంది. అందుకే కొంత అసంతృప్తితో అది తాత్కాలికంగా ప్రక్కన పెట్టి, ప్రత్యామ్నాయ స్వతంత్ర్య కథావస్తువుకై సాగించిన యానంలో సాక్షాత్కరించింది మా వంశ "మూల విరాట్" శ్రీ రాంభట్ల వేంకటరావు గారి జీవిత చరిత్ర. ఆతని వ్యక్తిత్వం గూర్చి కుటుంబంలో మా పెద్దల సంభాషణల ద్వారా ఎన్నో పర్యాయములు విన్న నేపథ్యంలో ఆ మహత్వమూర్తి చరిత్రని పద్యకావ్యంగా రూపొందించాలనే భావన స్థిరీకృతమైనది. ఆ సంకల్పబలం యీ నాటి ప్రస్తుత గ్రంథంగా వెలుగులోనికి వచ్చినది.

ఐతే! ఆ మహనీయుని చరిత్ర పద్యాలుగా రచించడానికి బలాన్నిచ్చిన సంకల్పం మాత్రం నాదికాదు. అటు అవధానాలలో, యిటు విద్యాభ్యాసంలోనే కాక అన్ని విధాల చేయూతనిస్తూ, వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ నేడీ మహత్కావ్యం రూపుదాల్చుడానికి ముఖ్య కారణమైన వ్యక్తి మా మాతామహి రాంభట్ల "సుబ్బలక్ష్మి" (గ్రేడ్-I, సూపర్‌వైజర్ ICDS ప్రోజెక్ట్, కొత్తూరు, శ్రీకాకుళం జిల్లా) గారు. ఆమె పేరులో అర్థభాగంగా మాత్రమే "కాసుల తల్లి" ఒదిగియున్నది కానీ, నాయీ తొలి గ్రంథానికి పరిపూర్ణ "అర్థ"ముని చేకూర్చి సాహిత్య లోకంలో నాకొక ఉన్నతస్థితిని కల్పించిన ఆ వ్యక్తిత్వానికి ఆజన్మాంతం ఋణపడియుంటాను.

మత్తకోకిలము॥ హృద్యమౌగతి వేంకటార్యుచరిత్రమున్ తగ వ్రాసితిన్
పద్యకావ్యమనంగ నీకృప, పావనీ మదినెంచదన్
విద్యలందవధానమందునువెన్నుఁ దట్టితి వీవెగా!
సద్యశోనిధి, "సుబ్బలక్ష్మి" విశాల హృద్వన మూర్తివై !!

ఈ 24, నవంబరు 2007 "కుప్పిలి డాక్టరు" గా ప్రసిద్ధులైన శ్రీ రాంభట్ల వేంకటరావు గారి 108వ జయంత్యుత్సవము. దీనిని పురస్కరించుకొని 108 పద్యాలుగా వారి జీవిత సంగ్రహమును "లఘు కావ్యం"గా రచించడం జరిగింది.

- వారి జీవితం ఉన్నది యున్నట్లుగా నిక్షిప్తం చేయబడిన యీ కావ్యంలో అక్షరాక్షరం తీక్ష్ణ పరిశీలన జేసి యీ గ్రంథానికి ఉన్నత స్థితిని చేకూర్చిన "ఆచార్య సార్వభౌములు", గురుతుల్యులు శ్రీ వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి గారికి కృతజ్ఞతాభివందనములతో....

కం. సుబ్రహ్మణ్య వరేణ్యా!
అబ్రంబగు వేదులాన్వయాంబుధిసోమా!
లేబ్రాయపుటవధానిని
వేబ్రోవుము శాస్త్రి వర్య! వేవేలనతుల్!

- "అ" అనినంతనే మమకారమే "మ్మ"కారంగా సాక్షాత్కరించే రూపం "మలయవాసిని" అమ్మ. అడిగిన వెంటనే వాత్సల్యంతో నాయీ తొలి గ్రంథానికి ఆప్యాయతనే "ఆశీస్సు"గా అందించిన ఆ మూర్తిత్వానికి ఎన్ని విరులతో అర్చిస్తే సమంజసం? అందుకే యీ "తరళము" తో యిలా...

తరళము. తెలుగు భాషను వన్నెకెక్కఁగఁదీర్చి శిష్యులనేకులన్
వెలయజేసిన ధీవిశారద వేరు సాటిక లేరుగా
నలరు వేదిక పైని గూర్చొను నమ్మ దీవెనలీయవే!
మలయవాసిని, మంజుభాషిణి, మాతరో ప్రణమిల్లెదన్

– సాహిత్య బంధువే కాక రక్త సంబంధీకులైన "అష్టావధాని" "పండిత" శ్రీ నేమాని రామజోగి సన్యాసిరావు (తాతగారు) గారు అవధానిగా మరిన్ని విద్వద్విశేషాలు తెలియజేస్తూ, చేయూత నిచ్చినవారు. అంతేకాక ప్రస్తుత కావ్యంపై అమూల్య అభిప్రాయాన్ని అందించిన ఆ "తాత"కు యీ "మనుమని" నీరాజనం.

కం. నే మాని యెరులకిచ్చుట
యే మాకున్నట్టి చిత్తవృత్తిగఁదెలిపే
నేమాని రామజోగికి
యేమిత్తును? దాచుకొందు హృదయమునందున్!!

– శ్రీ రాంభట్ల వేంకటరావు గారి తండ్రిగారైన (ప్రస్తుత కావ్య నాయకుని తండ్రిగారు) శ్రీ "రాంభట్ల వేంకట సోమయాజులు" గారి జీవితంలో చోటు చేసికొన్న అమూల్యమైన ఘట్టాన్ని తనదైన శైలిలో విశదీకరించి యీ గ్రంథాన్ని మరింత ప్రకాశవంతం జేసిన వారు "దహరానందనాథ" శ్రీ రాంభట్ల వేంకట సోమయాజులు (శ్రీచక్రపీఠం, హైదరాబాద్) గారు. వారికి హృదయ పూర్వక నమస్కృతులను అర్పించుచున్నాను.

– అడిగిన వెంటనే అద్భుతంగా కావ్య సారాంశాన్ని స్ఫురింపజేసే విధంగా ముఖచిత్రం వేసి యిచ్చిన చిత్రకారుడు శ్రీ డి.వి. రమణ (డ్రాయింగ్ టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్.కోట) గారికి హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనములు.

ఇట్లు

విద్వజ్జన విధేయుడు

"అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ

(B.Sc. Microbiology Final Year)

Dr. V.S. Krishna Govt. Degree College

VISAKHAPATNAM

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు గారి స్వీయ కవితా విలాసం

(లభ్యమైన వాటిలో కొన్ని మచ్చునకు)

శివ స్తుతి :

ఉ॥ శంకర, భావజభ్రమవశంకర, యింద్రియనిగ్రహంకరా,
హంకర, శత్రువర్గ విజయంకర, బిందుకళేక్షణంకరా,
ఖంకర, జ్ఞానమానసముఖంకర, మోక్షసతీగమంకరా,
వంకర లేని నీ పథముపాసన దుష్కరమెంతయున్ హరా!

అచ్చ తెలుగుకు మచ్చు తునక :

సీ॥ తలబోడిమొలబోడి తాఁజేసికొనగానె
దెయ్యాల యెకిమినీఁదెలియలేదు
బూడిద యొడలెల్ల బూసికొన్నంతనే
మిత్తిగొంగని గొల్చు బత్తిరాదు
కను, వాయి, ముక్కులు గట్టిగా బిగబట్ట
కోర్కుల గెలువంగకొఅకు రాదు
గంజాయి నెక్కుడు ఘనముగాఁబీల్చిన
గౌనము గల్గని వానిఁ గనగలేఁదు

తే.గీ॥ ....
జ్ఞాన సిద్ధియుఁగలుగంగ జాలదింక
తిన్ననౌ బాట బుద్ధిని త్రిప్పుకొనుచు
కాని పని చేయకునికియ కాదె మేలు

శ్రీరామస్తుతి :

శ్లో॥ కాకుస్థ వంశం కమనీయ రూపం
రామేతి నామ్నా జగతః ప్రసిద్ధం
యో సర్వ జీవేషు రమతే సమంతాత్
తం రామనామం మనసాభజామి॥

సీ॥ రాజీవలోచన రమ్యగుణోపేత
రాక్షసాంతక సూర రామచంద్ర!
దశరథేశ తనూజ! ధరణీపతి బిడౌజ!
భక్త కల్పక భూజ! భానుతేజ!
సుగ్రీవ మిత్ర! దశగ్రీవ జైత్ర! సం
తాపలవిత్ర! సీతాకళత్ర!
పార్వతీపతి హితా! వాక్పతీ పతిపితా!
సద్భక్త హృద్గితా! సత్య చరిత

తే॥గీ॥ భర్గ వినుత! భండనజిత భార్గవుండ!
పావన చరితుండ! పతిత పావనుండ!
దివ్యసౌభాగ్య సద్యశోదీప్తులొసగి
బ్రోచెదీవని నమ్మితి బ్రోవుమయ్య!
రమ్యగుణధామ! శ్రీరామ! రంగధామ!

కం॥ భగవంతుడెలమి జీవికి
తగవొదవనియునికి గలుగ తథ్యము పలుకన్
పగలేని బ్రతుకు బ్రతుకుట
కగు మెదడు గలట్టి పుర్రెననువుగ నిచ్చెన్!!

"అపూర్వ కవిత్వ కార్యానుక్రమణిక" అను ఖండిక నుండి....

కం॥ కవితాధీయుతుడైనన్
సవిమర్శనకైతఁజెప్పి సద్భావములన్
భువి బుధులమనము సాకును
నవయుగ శిక్షిత, సుయోధ నాథునిఁబోల్చెన్

కం॥ టెంకాయకైత యంచును
టెంకెంబులు పల్కుచుంద్రు టీకన్ గనమిన్
పంకేరుహ రుహుసతినక
లంకస్థితిఁగొల్వ వేగ రారయొ! కట్టా!

దసరా పద్యం

(విద్యార్థులకై వ్రాసిన బాపు చరిత్ర)

ఘూర్జరదేశమున నిర్జరాంశమున
పోరు బందరునందు పొలుపు మీరగను
ఉద్భవంబొందెను ఉత్తముండొకడు
గాంధివంశము నందు కరమొప్పుగాను
కర్మచందుని కొడుకు కడగొట్టువాడు
మోహన దాసుండు మోహనాకారు
డొజ్జయై దనరారె ముజ్జగమ్ములకు
అతడె మహాత్మునా నలరారె భువిని
సత్యంబు పలుకుటే నిత్యజీవనము
హింసింపకుండుటే యిష్టదైవతము
స్వాతంత్ర్యసిద్ధికై సతతంబుగాను
పోరు సల్పుచు నతడు భారతావనిలో
ఖద్దరు ధరియించి ఖద్దరే వడికి
హరిజనోద్ధరణమ్ము విరవిగాఁజేసి
ఖండ ఖండములందు ఖ్యాతి బొందెనుగ
అల్పులకు, దీనులకు కల్పతరువతడు
బీదలకు, సాదలకు పెన్నిధేయతడు
నిర్జితేంద్రియుడతడు దుర్జయుండరికి
వారు జెప్పిన రీతి వరుసగా నడచి
దేశభక్తులు కండు దిట్టతనమునను!
ఖ్యాతి బొందుడు మీరు నీతి వీడకను!!

(రాంభట్ల వేంకటరావు)

గ్రంథారంభం

దైవ స్తుతి

కం॥ శ్రీ కాశీవిశ్వేశా!
లోకైక శుభంకరేశ! రుద్రా! భద్రా!
మాకామితార్థ దాయక!
శ్రీకంఠా! నిన్ దలంతు చిత్తమునందున్!!

మ॥ అలకైలాసమునందు గౌరియొడిలోనానందమున్ గ్రోలుచున్
పిలువంగానరుదెంచు దైవమ! మహా విఘ్నేశ! ప్రార్థింతు, నా
కలముంబట్టితి వీవెయన్నపగిదిన్ కావ్యాంతమున్ బ్రోవుమా;
యిలలో సర్వశుభమ్ములిచ్చు వరదా! శ్రీ వక్రతుండా! ప్రభో!!

శా॥ శ్రీకారమ్మును చుట్టుచుంటినిదియే శ్రీనాథ, వెంకన్నవై
ఏకాకారము దాల్చి నిల్చి మదిలోనింపైన భావమ్ములన్
వైకుంఠేశ! యొసంగి నాదు "కులకావ్యమ్మున్" మహిన్ నిల్పగా
చేకూరంగను చేయుమయ్య బలమున్ శ్రీ సప్తశైలేశ్వరా!

ఉ॥ పంచముఖంబులన్ వెలసి భక్తుల బ్రోచెడు వేదమాత, నీ
పంచను జేరి వేడెదను పాదములన్ విడనింకదేవి, నే
నెంచితి నీవె దైవముగ నేమనిఁజెప్పుదు నీదు శక్తి, రా
యంచయె వాహనమ్ముగ మదార్తినిఁ దీర్చు మదంబరో నతుల్!!

కం॥ కలనైనన్ నినుమరువక
తలతుము రాంభట్ల వంశదైవమ, సతమున్
నిలకడతో మముఁగాచెడు
నిలవేలుపు "వేంకమాంబ" నిదె ప్రార్థింతున్!!

రాంభట్ల వేంకటీయము

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావు (కుష్ఠి డాక్టరు) గారి సంగ్రహ జీవిత చరిత్ర

(పద్యకావ్యం)

1. కం॥ అది యాంధ్ర విజయ నగరం,
బది గజపతి నగరపుదరి, నత్యున్నతమౌ
నది కెంగువాగ్రహారము,
పదిపై నవశతములున్న వత్సర మదియున్!!

2. తే.గీ॥ అచట నిత్యాగ్ని హోత్రుండు, నవని సురుఁడు,
చూడ రాంభట్ల వంశంపు రేడతండు,
కాంక్ష మీరఁగ వెంకన్నగారు మదిని
ధర్మపత్ని సుబ్బమ్మపై ధ్యాస నిలిపె!

3. మ॥ నవమోహంబున హృద్వనమ్మునను సంతానాభిలాషాధృతిన్
గవయన్ దంపతులా ముహూర్త మహిమన్ గర్భమ్ము నిల్చెంగదా
యువిదల్ దెచ్చిరి సూడిదల్ దినదినంబొక్కొక్కరొక్కొక్కటిన్
నవమాసంబులు నిండె, సుబ్బమ మహానందమ్ముతో నుండగా!!

4. కం॥ పరగ నవంబరు నెలలో
నిరువది నాల్గవ దినమున, నిరులుడుఁగన్ భా
స్కరుఁడుదయించు విధమ్మున
బరమేష్ఠినిఁబోలు నొక్క బాలుంగనియెన్.

5. కం॥ వెంకన్నా సుబ్బమ్మలు
వెంకన్నా వేంకమాంబ వేల్పుల దయతో,
"వేంకటరావ"ను పేరిడి
రింకన్ శిశుకంఠ శోభ యింటను నిండెన్!!

6. కం॥ శోకము కాదారాగము,
శ్రీరాకుళ కుప్పిలి యెడ శ్రీకరనాదం
బేకైక రోగమంత్రము
లోకంబుల మేలుఁగొలుపు శ్లోకంబునగున్!

7. తే.గీ॥ హరితుఁడంబరీష యవనాస్య ఋషివరులు
మువురు రాంభట్ల వంశంపు మూల పురుషు
లగుట, హరితస గోత్రమై యలరు చుండు
భూసుర గ్రామణులయందు వాసికెక్కి

8. తే.గీ॥ అట్టి హరితస గోత్రాన్వయమ్మునందుఁ
గలిగెనాబాలుఁడపర శంకరుని భంగి,
యతఁడు వెంకన్న సుబ్బమ్మలనుఁగు సుతుఁడు
తేజమొప్పగ వర్ధిల్లె దినదినమ్ము.

9. కం॥ కొడుకన కైదవ వత్సర
మదుగిడె, వెంకన్న అక్షరాభ్యాసంబున్
కడుముదమునఁజేసియుఁదా
బడి చదువుల కంపె వాని వాణీకృపకై!!

10. తే.గీ॥ తనయు చదువుల మదిలోనఁదలచుకొనుచు
కంటఁదడి లేక తనకున్న పంటపొలము
కౌలుకిచ్చియు వెంకన్న కర్షకులకు
స్వగృహమును వీడి ధృతి తోడవలసఁబోయె

11. తే.గీ॥ అగ్రహారమ్ము నుంబాసి యాత్రయమ్ము
విజయనగరమ్ము చేరి, రావిప్రవరులు
బ్రాహ్మణులు వాసముండు దివాంజి పేటఁ
బెంకుటిల్లుఁ గట్టించిరి వేడ్కమీఱ!!

12. తే.గీ॥ ఆలుబిడ్డల తోడుత హాయిగాను
కాపురంబుండె నందు వెంకన్న గారు
మూలికా వైద్యమందున ముఖ్యుడగుచు
దేవతారధనముతోడ దీప్తినందె

13. తే.గీ॥ పూర్ణ దీక్షాపరుండయి మోక్షమొసగుఁ
రాజరాజేశ్వరీదేవి రక్ష కాగఁ
కుంకుమార్చనఁ జేయుచున్ గొరత లేక
సత్య దీక్షను వెంకన్న సాగుచుండె!!

14. తే.గీ॥ అరయ సప్తమ వత్సరమందు నొసగెఁ
దండ్రి బ్రహ్మోపదేశమ్ము తనయునకును;
బ్రహ్మ చర్యంపు దీక్ష చేఁబట్టి చేసె
నతడు "నక్షర లక్ష గాయత్రి" జపము.

15. తే.గీ॥ సోమయాగము తలపెట్టి సూనుజప ఫ
లంబు ధారవోయించి సద్రక్ష యనగ;
"సోమయాజి"గ వెంకన్న శోభ మీరె,
"సోమద"ను నామమునుఁబొందె సుబ్బసాధ్వి

16. కం॥ అది వేంకటరావునకున్
బదునాల్గవయేడు, తల్లి పరమపదించెన్!!
హృది కలచు విషాదమునం
దుదయించెను "వైద్య విద్య" యొక కోరికగా!!

17. కం॥ యోగాసన సాధనమున
రోగములకతీతుడై పురోగతిఁబొందెన్!
బాగుగ వ్యాయామంబునఁ
దాఁగొనె, నద్భుత శరీర దార్ఢ్యమునెలమిన్!!

18. కం॥ విద్యల నగరమునందున
విద్యాభ్యాసమ్మును నెరవేర్చుచు నెదిగెన్!!
విద్యల * "ఎఫ్ఫే" జేరిన
హృద్యములౌ రోజులవియు నెంచగ నపుడున్!!

19. ఆ.వె॥ మొదటి వత్సరమ్ము ముగిసి, రెండవ వర్ష
మదియు గడిచి జేరె నంత్య దశకు
వ్రాయనెంచి నట్టి వ్రాత పరీక్షలో
చోటుఁజేసికొనెను చోద్యమొకటి!!

20. శా॥ ఆనాడాంగ్ల పరీక్ష! దాని విడె నాయాంగ్లేయులన్ గూల్చఁగన్
"జై" నాదేశ నినాదమున్ భరతభూస్వాతంత్ర్య సంగ్రామమున్
నానా కంఠ సమూహమందొకటి గా నవ్యప్రభుత్వమ్ముకై
తానుంగాంధి మహాత్ము వెంటఁజనె సిద్ధాంతమ్ముకై స్ఫూర్తితో!!

21. కం॥ స్వాతంత్ర్యోద్యమ పుణ్యము
నా తరిఁదప్పెన్ పరీక్ష, నా యపజయమున్
ఖాతరు జేయక, తాఁగృషి
నూతగఁగొని బింకమలర నుత్తీర్ణుఁడయెన్

22. ఆ.వె॥ పడుచు ప్రాయమందె పదునెన్మిదవ యేట
సూర్యకాంతమతని భార్యయయ్యె
కదిలివచ్చినట్టి కళ్యాణ ఘడియల
దాట సాధ్యమౌనె ధాతకేని?

23. శా॥ జ్యోతిశ్శాస్త్రమునందు భాస్కరుఁడు తా జ్యోతిర్మయీ పుత్రుఁడౌ
తాతాపాపయ శాస్త్రియున్ దనయ కాంతమ్మన్ గడున్ బ్రీతితో
వ్రాతల్, జాతక చక్రముల్ కలియ కళ్యాణమ్ము గావించి, జా
మాతౌ వేంకటరావు వెంటనలివేల్మంగమ్మగాఁ బంపెనే!

* F.A. ఫెల్లో ఆఫ్ ఆర్ట్స్ (ఈనాటి ఇంటర్మీడియట్)

24. కం॥ ఆ పై "డాక్టరు" చదువగఁ
దాపత్రయ పడుచు నడిగెఁతండ్రి, నతండున్!
గోపముతోఁ గాదనుచున్
నా పలుకులు వినుమటంచు నయమునఁజెప్పెన్!!

25. కం॥ పరజాతులనంటుట భూ
సురులకు క్షితిఁజెల్లదంచు సూక్తులఁదెలిపెన్
దొరవిద్యల నేర్వగనీ
యురుకులనిఁకఁగట్టిపెట్టుటొప్పని పలికెన్

26. కం॥ కాయములన్ కోయఁగ వలెఁ
ఛీ యనకే యెన్ని పనులో చేయగ వలయున్
నాయన! నీవావైద్యపు
ఛాయలకున్ పోకుమంచుఁ జక్కగఁదెలిపెన్

27. కం॥ అల్లోపతిఁ జెప్పింపగ
వల్లయు గాదయ్య ధనము పంపఁగ నాకున్!
కల్లగు విద్యలఁబట్టుట
చెల్లదనెన్ తనయుఁగాంచి స్థిర వాక్యముగా!!

28. కం॥ అంతట వేంకటరావున్
జింతాక్రాంతమ్మునైన చిత్తము తోడన్
సుంతయునాలింపక తాఁ
బంతమునన్ దండ్రి యెదుటఁబలికెన్ ధృతితో

29. కం॥ ఈయా మాటలఁజెప్పక,
పోయెడి నా బండి నిటులఁ బోనిమ్మనియెన్;
జేయుట వైద్యాభ్యాసము
ఖాయంబని తేల్చి చెప్పి కరములు మోడ్చెన్!!

30. కం॥ చేకొనె నొక నిర్ణయమున్
లోకములేయేకమైన రూఢిగఁజదువన్
మేకొంచు "వైద్యశాస్త్రము";
శ్రీకారముఁజుట్టె నతడు శ్రీరాము దయన్!!

31. శా॥ సామాన్యుండయి విద్య నేర్చుటకునై సాగించుచున్ యానమున్
రామానీదియ భారమన్న పగిదిన్ లక్ష్యమ్ము సాధింపఁగా
మీమాంసల్ విడి యేక చిత్తమునఁ దా మేలెంచి, స్వాతంత్ర్యమే
క్షేమంబంచు విశాఖపట్టణమునన్ "కింగ్జార్జి" అస్పత్రిలోన్.

32. కం॥ తడబడి పలు జడిమలఁదా
"మెడికల్ కాలేజి" యందు మేలుగఁజేరెన్;
బడుచున్ బాట్లను, కొల్లలు
నడుగడుగున రామచంద్రునాత్మఁదలంచెన్

33. ఆ.వె॥ నాల్గు వత్సరములు నడువంగనీరీతి
వెల్గుఁజూసె వైద్య ఫల్గుణుండు
సకల శస్త్రములను సాధించి, వ్యాధులన్
బారఁద్రోలనురికె తేరునెక్కి

34. కం॥ * "ఎల్లెంపీ" పట్టాగొనె
నెల్లరకున్ సేవఁజేయనెంచెను, దనదౌ
యుల్లంబున వైద్యమ్మును
బెల్లగు దైవంబనంగ బ్రీతిన్ నిలిపెన్

35. కం॥ పలుశాఖల వైద్యమ్మున
బలురీతుల శిక్షణఁగొని పండితుఁడయ్యెన్
బలు చోట్లను పనినేర్చెను
పలువురి రక్షించి నిండు ప్రాణములొసఁగెన్!!

* L.M.P. : లైసెన్షియేట్ మెడికల్ ప్రాక్టీసనర్

36. తే.గీ॥ పరగ "ముషనూరు వేంకటేశ్వరుని"ఁ గూడి
జంటగా సేవలిడి చికిత్సాలయమునఁ
గొన్నినాళ్ళనుభవమును గొన్న పిదప
తరలె నుద్యోగముంజేయఁ బురము వీఁడి!!

37. ఆ.వె॥ తండ్రి గారి నీడ, దన సతీమణి తోడ
వడ్డె దేశమునకు వలసఁబోయి
కొన్ని వత్సరముల కొలదియు "కళ్యాణ
సింగు పురము"నన్ వసించి యుండె

38. ఆ.వె॥ అలరె నవ్యకాంతులచ్చోట వారింట
విరిసె నవవసంత విరులశోభ
గర్భమంద సూర్యకాంతమ్మ తొలుతగా
మురిసెవారి జంట ముదముతోడ

39. కం॥ ఆ తన్వి సూర్యకాంత
మ్మొ తనయకు జన్మనిచ్చి యుత్కృష్టంబౌ
మాతృత్వమన్నమాటకు
నౌ తియ్యందనము నచటె యాస్వాదించెన్!!

40. తే.గీ॥ ప్రభవ వత్సరమున బ్రభవించె నాసుత
యాదిలక్ష్మిదేవి యంశ యనగఁ
బిలువనెంచెనామె నిలవేల్పు పేరిట
"వేంకమాంబ" యనుచు వేడ్కమీఱ!!

41. ఆ.వె॥ "సుబ్బసోమదేవి" సుగుణ శీలములన్ని
సంతరించుకొనఁగ సద్గతి, తన
తల్లి పేరుఁబెట్టెఁ దదుపరి తనయకున్
శుక్ల నామ వర్ష శోభయందు.

42. ఆ.వె॥ మన్యదేశమద్ధి, మనగ సాధ్యముఁగాక
విడువనెంచెనట్టి విపినసీమ
నచటి నుండి సాగెనతడు కుటుంబియై
తిరిగి విజయనగరపురమునకును

43. కం॥ "రూరల్ డిస్పెన్సరి"లోఁ
జేరగ దరఖాస్తుఁజేసి జిల్లా బోర్డున్
గోరఁగ, "కింతలి", "కుప్పిలి"
యూరల వైద్యంపు గొరత యుండగఁదెలిసెన్!!

44. కం॥ తప్పొప్పులు రామేచ్ఛగ
గుప్పెడు మదిలో దలంచి, గురువైద్యుడు తాఁ
గుప్పిలిలోనుద్యోగము
నొప్పుగఁ జేయంగనెంచె నుత్తమ మనుచున్!

45. సీ॥ కనుచూపు మేరలో కడలి దర్శనమిచ్చి
వినసొంపు ఘోషతో విందుఁజేయు,
మొగలి పూవుల గంధమును ఘ్రాణమొనరింపఁ
దనువెల్లఁ బులకించుఁ దన్మయమునఁ,
గపటమ్ము నెరుగని గ్రామవాసుల మనం
బులు మాటలందునే తెలియవచ్చు,
మట్టిదారులు పంచు మధురానుభూతుల
నెత్తు పల్లంబులన్ హృద్యముగను,

ఆ.వె. గెడ్డ చెలమనీరు గీర్వాణ కోటికా
ధారమై చెలగుసుధారసమ్మె.
యిట్టి యానవాళ్ల నిల స్వర్గసీమయే
కుప్పిలన్న పేరఁగొల్పు తీరె!

46. తే.గీ॥ అట్టి కుప్పిలి గడ్డపై నడుగు పెట్టి
సేవఁజేయఁగనెంచెను రావుగారు;
"సమయమేతెంచెఁ కారణ జన్మునకును
తనదు కర్తవ్యమొనరింప ధరణియందు"!!

47. సీ॥ అంధకారముఁ బాపి యవని మేల్కొల్పంగఁ
జనుదెంచు చున్న భాస్కరుడనంగ,
ముకుళించుకొనియున్న ముద్దు కల్వలఁదట్టి
చైతన్యమున లేపు శశియనంగ,
శీతలత్వముఁ గూర్చి జీమూతములనిలన్
వర్షింపగాఁ జేయుఁ బవనుఁడనఁగ
వైద్య సంపదలేక వ్యాధులనల్లాడు
వారి పట్లను దేవవైద్యుడనగ.

తే.గీ.॥ బ్రహ్మ తేజమ్ము నరునిరూపమ్ము దాల్చి
భువిని వేంకటరావుగా నవతరించి,
కాలుమోపెను "కుప్పిలిగడ్డ" పైన
వైద్య నారాయణుండయ్యె భవ్య గతుల!!

కోదండరాముడు

48. శా॥ చేతంబూని కఠోర రాక్షసులకున్ జేటైన కోదండమున్
సీతాలక్ష్మణపూర్ణుఁడై, వరదుఁడై, శ్రీరామచంద్రుండు తాఁ
బ్రీతింబాలనఁజేయుచున్, గరుణతో వీక్షించుచున్ దక్షుడై
యేతద్గ్రామ జనంబుఁబ్రోచునెపుడున్ హృత్పద్మసంవాసియై!!

కుప్పేశ్వరుడు



49. సుగంధి॥ ఈశుఁడున్ మహేశుఁడన్ మహేశ్వరీ ప్రియేశుఁడున్
గాశికాపురీశుఁడున్ ధగజ్వలత్త్రినేత్రుఁడున్
శ్రీశివానినాథుఁడున్ కరీంద్రచర్మధారి కు
ప్పేశుఁడయ్యెనప్పురానఁ బేర్మికూర్మితో మహిన్!!

50. ఉ॥ కేశవ దర్శనమ్ముఁబరికింపగఁ బెక్కులు వత్సరంబునం
దాశివరాత్రినాడు మరియాపయి కార్తిక సోమవారమం
దీశుని దర్శనమ్ముఁగొనునేటికి రెండు దినమ్ములందె, కు
ప్పేశుడు వానిరాకకయి యెంత తపించునొ? వేచియుండునో?

ఇల్లు



51. సీ॥ మట్టి గోడలె గాని మమతానురాగాల
నింపి కట్టిన మహానిలయమద్ది,

యిరుకు వాకిలె గాని ఇనవంశరామయ్య
హృదయమ్ము గలవాని సదనమద్ది,
మిద్దెటిల్లే గాని మేదినిన్ సరిలేని
వ్యక్తికి నెలవైన వాసమద్ది,
కమ్మరిల్లే గాని "ఘనగుణమ్ముల రాశి"
బ్రాహ్మణోత్తముడుండు భవనమద్ది,

తే.గీ.॥ అదియె సౌఖ్యమ్ములొనగూర్చు నవనినాక
మదియె రోగాలఁబరిమార్చు నాలయమ్ము,
సతతమానందమునఁదూగు సద్గృహమ్ము
నదియె వేంకటరావునకాకరమ్ము

ఇల్లాలు

52. కం. ఒక వంకను గృహకృత్యము
లొక వంకను పొలము పనులనోపిక తోడన్
జకచకఁజేయుచు, భర్తకు
సకలంబై సహకరించు సతికాంతము తాన్!!

53. తే.గీ.॥ అతిథులేతెంచగా వారి నాదరించి
వండి వడ్డించుచుండు నా పరమ సాధ్వి
షడ్రసోపేతమైన భోజనముఁబెట్టు
దొడ్డయిల్లాలు కాంతమ్మ తొట్రువడక

సోమయాజులు గారు పరమపదించడం

54. ఉ.॥ కంటికిఁజూపు తగ్గినది కాళ్లనుసత్తువ సన్నగిల్లె, తా
నొంటరిగా మనంగనిక నొప్పదటంచును "సోమయాజి" వే
వెంటనె చేరె కుప్పిలికి, వేంకటరావును సంతసించె; నా
యింటనె ప్రాణముల్ విడచెనిష్ట జనమ్ముల సేవలందుచున్

కుప్పిలి బిడ్డలు

55. కం॥ పరికింపనెంత ప్రేమయొ!
ధరనొక జీవమ్ము రూపుదాల్చుట యనగా!
సిరికొల్వు తీరియుండెను
నరయగ సంతానలక్ష్మియై తన యింటన్!!

56. కం॥ వరుసగ నల్వురు సుతులును,
వరుసగ నల్వురు సుతలును వత్సరభేదాల్
చిరుమాత్రంబుగ, విరులై
విరిసిరి రాంభట్ల వంశ వృక్షమునందున్!!

57. కం॥ నిలుప తన జనకనామము,
నిలబెట్టెడు సుతుఁడుఁగాగ, నేర్పరి కాఁగన్!!
గలిగిన తొలి పుత్రునిఁదా
నలరఁగ రాంభట్ల "సోమయాజి"గఁబిలిచెన్

58. కం॥ పుట్టిన ద్వితీయ సుతునకు
పెట్టెను దన మామగారి పేరొప్పంగా
నుట్టిపడు తేజముంగని
యిట్టుల రాంభట్ల "పార్వతీశుండ"నియెన్!!

59. కం॥ తిక్కన భారత గాథన్
మక్కువచే నొక్కసుతుని మాన్యుడుఁగాగన్
చక్కగ "హరిహరనాథ"గ
మిక్కిలి సంతోషమొప్ప మేకొని పిల్చెన్!!

60. ఆ.వె. పుట్టెనొక్కపట్టి పుత్రికారత్నమై
రామభట్ల వారి గీమునందు
ముదము నెంచి చూడ మూనాళ్ళ ముచ్చటై
స్వర్గసీమకామె నిర్గమించె!!

61. ఆ.వె.॥ బాలకృష్ణుఁడనిన వాత్సల్యముప్పొంగఁ
గొమరులందు చిన్న కొమరునకును
"బాలకృష్ణశర్మ" పావన నామమ్ము
పెట్టి పిలిచెనతడు ప్రీతితోడ!!

62. ఆ.వె.॥ అవని యంబరూపమనురీతి నొకపుత్రి
యతని యింట కుప్పిలందుఁబుట్టె
నత్తగారి నామ"మన్నపూర్ణ"ను బెట్టె
నా తృతీయ సుతకు నలరు రీతి!!

63. కం॥ సత్యంబగు "రాజేశ్వరి"
నిత్యోపాసకుఁడు తండ్రి నిశ్చలమతితో
నత్యున్నత మానామము
ప్రత్యక్షర రమ్యమొక్కపాపకుఁబెట్టెన్!!

64. ఆ.వె.॥ సగముఁదల్లి పేరు, సగము కాసుల తల్లి
పేరు కలియఁబెట్టి, వెరసిఁజూడ
"సుబ్బలక్ష్మి"యన్న సూనృత నామమ్ము
నొసగె ప్రేమఁదోడ నొక్కసుతకు!!

65. తే.గీ॥ అన్నవరమందు వేంచేసియున్నవేల్పు
సత్యదేవుని నామమ్ము సార్థకముగ
గార మొప్పగనొసగెను కడమసుతకు
"సత్యనారాయణమ్మ"గా సంతసమున

66. మ.కో.॥ అక్కరమ్ములనాదిగా మతిహద్దుపద్దుల నేర్పుచున్
నిక్కమౌయితిహాస గాథల నీతిబోధలఁదెల్పుచున్
బెక్కువిద్యల శిక్షణమ్మిడి, విజ్ఞతాత్ములఁజేయుచున్
జక్కనౌగతి తీర్చిదిద్దెను సంతతిన్ కడుశ్రద్ధతో!!

67. కం॥ కన దుహితలకనునయమున
తన యింటనె పురుడుఁబోసి, తాతవిధాతై!
మనుమల మునిమనుమలకిల
నొనగూర్చెను జీవమెలమి నొప్పగు రీతిన్!!

68. కం॥ ఇంపుగఁగాచిన నేతులు,
తంపిని మరిగించు పాలు, తాజాకూరల్
దంపుడు బియ్యపుటన్నము,
పెంపెసగభుజింత్రువారు ప్రీతిఁదలిర్పన్!!

69. ఉ॥ వైద్యముఁజేయుచుండి పలు వ్యాధుల మాపుచు; పొట్టకూటికై
సేద్యము నూతగా గొనె కృషీవలుడై; యటు స్వచ్ఛమౌస్వరా
జ్యోద్యమ భావనల్ జనుల సూక్తులఁదెల్పుచు, దేవపూజ్యమౌ
పద్యము సాహితీసతికి పట్టముఁగట్టగఁబట్టెనెంతయున్

70. ఉ॥ నామమునెంచినేని పదునాలుగుపేటలకేక వైద్యుడున్
ప్రేమను సాక రోగి వ్యధ పేరుకునైనను చేరదేదరిన్
కోమలమూర్తి, కోపనిధి "కుప్పిలిడాక్టర" నంగ ముఖ్యుఁడౌ
నామహనీయు స్పర్శను నయంబయి పారని రోగమున్నదే?

71. చం॥ నిలకడయైన వైద్యమట నిక్కము కుప్పిలి గ్రామమందునన్
కలకల నవ్వఁగా జ్వరము కానఁగ రాదిక రోగిచెంతనే
ఫలమగు స్పర్శయౌ నదియు పావనవేంకటరావు గారిదా
ఫలమును గ్రోలినన్ తరలు వ్యాధులటంచును నమ్మిరాజనుల్!!

72. ఆ.వె.॥ ఉష్ణదేశ రుజలనుడుపగా కలకత్త
చేరి వైద్యమందునారి తేరి
సూక్ష్మకాలమందె "స్కూలాఫుట్రాపికల్"
మెడిసనందు ఖ్యాతి బడసెనతఁడు

73. కం॥ అరయ "ప్రజారోగ్య"మునకు
"పరిరక్షణశాఖ"లోన ప్రత్యేకముగా
నెరవేర్చె శిక్షణమ్మును
మరియా మద్రాసు *పూనమల్లిని గనఁగన్

74. తే.గీ॥ నాటి వైద్యులయందున మేటియైన
"లక్ష్మణస్వామి మొదలియార్" శిక్షణమున
నేర్చియు ప్రసూతి వైద్యమ్ము నిశితముగను
సాటిలేనట్టి వైద్యుడై సాగెనతడు

75. ఆ.వె.॥ మంత్ర శాస్త్రమునకు మారుపేరుగ నిల్చి
కీర్తికెక్కినట్టి మూర్తియతడు,
ఎట్టి రుగ్మతైన యిట్టెతొలఁగిపోవు
నతని చూపె మంత్రమన్న రీతి.

76. కం.॥ మంత్రముచే విషమును, తగు
యంత్రముచే వ్రణములాది హానికరంబుల్.
తంత్రమున మనోరుజను, ని
యంత్రించునటన్న గొప్ప ఖ్యాతివహించెన్!!

77. కం॥ తనరాక తెలిసినంతనె
తన చూపులు సోకినంత తరలును రోగాల్
తనకరము తగిలినంతనె
మనుజ మనోవ్యాధులుడుగు మటుమాయంబై॥

* పూనమల్లి : మద్రాసు దగ్గఱ ఒక గ్రామము

78. కం॥ ఆయుర్వేదము తోఁదగ
నాయువు నిడునట్టి దిట్ట, యాతని కనినన్,
జేయందించినఁజాలదె?
వేయంగను మందులేల వృథయగునవియున్!!

79. కం॥ చేపట్టెను సేద్యంబును
బ్రాపుగఁదమ భుక్తి కొఱకుఁ బశుపోషణతో
నాపదల లెక్కఁజేయక
యేపున సాగించె ముప్పదేండ్లకు పైగా!!

80. తే.గీ॥ వరిని పండించి పొలముల విరివిగాను
పెసలు, నువ్వులు, మినుములు, వేరుసెనగ
పైరులన్వేసి శాస్త్రీయ పద్ధతులను
రాలుఁబడి హెచ్చుగాదెల రాశిపోసె!!

81. ఆ.వె.॥ ఆది సూర్యకిరణమవనిఁ జేరు వడిని,
శరము లక్ష్యమునకు సాగు గతిని
జెలమ వీడి దూకు సెలయేటి కరణిని
నాశుపద్యమల్లునట్టి దిట్ట!!

82. తే.గీ॥ సంస్కృతాంధ్రంబులందును చతురుఁడగుచు
నాంగ్ల, జాతీయ భాషలందభినివేశ
మలర, కవిచక్రవర్తియై, యాశుపద్య
మాలికలనల్లె నద్భుత లీలనతడు!!

83. కం.॥ తేట తెలుంగున నాపై
సాటిక లేదనినరీతి సంస్కృతమందున్!!
మాటలతోఁదేలికగా
చాటువులన్ చెప్పినట్టి సర్వజ్ఞుండున్!

84. కం॥ *కేవల కవి, విద్వత్కవి,
కేవల విద్వాంసుడనుచు, కింకన్ మదిలో
భావింపక, భాషాసతి
సేవింపుడ" టంచుఁబల్కె చిత్త స్ఫూర్తిన్!!

85. తే.గీ॥ "క్షీర సాగరమథనమ్ము" పేరనొక్క
ద్వ్యర్థి కావ్యమ్ము వ్రాసెనన్వర్థముగను
నమృతభాండమ్మె యాగ్రంథమవనియందు;
కాలగర్భమ్మునందది కరిగిపోయె!!

86. తే.గీ॥ కావ్యకంఠవాసిష్ఠుని ఖరగుపూరు
నందు దర్శించి స్ఫూర్తితో యాదినమ్మె
యాదిగా జీవితాంతమ్మునామనీషి
"పావకోళ్ళు" ధరించెను పాదములకు!!

87. ఉ॥ ఖద్దరు వస్త్రధారియయి, కాళ్ళకు రక్షగ పావకోళ్ళతో
నద్దిన గంధమున్ నుదుట నాపయి కుంకుమ బొట్టుఁవెట్టి తాఁ
బెద్దగ గ్రామమంతటికి విజ్ఞత, సభ్యత మారుపేరుగాఁ
బ్రొద్దది యాదిగా జనుల పొల్పుగసాకు మహానుభావుడై!!

88. కం॥ బాపూజీతో కార్యక
లాపములన్ లేఖలందు గ్రామాభ్యుదయం
బేపారగ సాగించుచు
స్థాపించెను శాంతితత్త్వ సామ్రాజ్యంబున్!!

89. తే.గీ॥ "గాంధి యిర్వీను సాల్టు ఫ్యాక్టరి"నిఁబెట్టి
యుప్పు పండించి చౌకగా నూర నూరఁ
బ్రజలకెల్లను సహకార పద్ధతులను
బంపిణీఁజేసెనేకైక పావనుండు!!

---

* కేవలకవి ... : శ్రీ రాంభట్ల వేంకటరావుగారి స్వీయరచన

90. కం.॥ సహకారబ్యాంకు ఋణముల
నహరహము శ్రమించి కర్షకాళి పసిండిన్
మహిపండించిరి, ఘనుఁడా
"మహనీయు నితాంతకృషిని" మరువగఁదరమే?

91. కం॥ అంబరు చర్ఖాఁదెచ్చెను
సంబర పడినూలు వడికె జంటకదుళ్ళన్
*"నంబరు అరవై" కాగా
నంబారీనెక్కినట్టులానందించెన్!!

92. కం॥ అందిన నూలంతయు నా
పొందూరున మగ్గములను బొందికగా రూ
పొందించెను బంచలుగా
నందముగాఁ గట్టివాని నపురూపముగా!!

93. తే.గీ॥ రాట్నమున్ త్రిప్పి ప్రత్తిదారమ్ముఁదీసి
మంచి ఖద్దరు వస్త్రాల మైధరించి
గాంధి భావాలు బోధించి గ్రామ జనుల
సర్వ విధములఁగాఁచు నిగర్వి యతఁడు!!

94. కం॥ ఎందరికో యిప్పించె ప
సందుగ "కాంగ్రెస్సు" నందు సభ్యత్వంబున్!!
హిందీనేర్వండని, పది
మందికి భాషోద్యమమున మార్గముఁజూపెన్;

95. కం॥ విద్యార్థులకై దసరా
పద్యములుగ వ్రాసియిచ్చె "బాపు" చరిత్రన్;
హృద్యంబగు తెలుగున, నది
సద్యశమును పొందె నాఁడు సంఘమునందున్

* నంబరు అరవై : పంచలకు ప్రశస్తమైన నూలు

96. ఆ.వె॥ అంటరానితనము కంటె పాపమ్ములే
దన్నరీతి వైద్యమందఁజేయ
మాలపల్లికేగి మానవత్వముఁజాటె
వైద్యవృత్తి గౌరవమ్ముఁబెంచె

97. తే.గీ॥ తన కుమార్తెల పెండ్లి సందర్భమందు
నేక పంక్తిని భోజనాలేర్పడంగ
విందుఁగావించె నూరివారందరికిని
కులవిచక్షణ పాటింపఁ గూడదనుచు!!

98. కం॥ భారత రామాయణములఁ
బారాయణఁజేసి గొప్ప పౌరాణికుఁడై
యూరిజనంబులకాయా
సారమ్మును బంచుచుండు సంతసమొప్పన్!!

99. కం॥ ధనమంచుఁబల్క పాపము
ధనముంగొని సేవలిడుట దౌర్భాగ్యంబౌ
నని తలచు మూర్తి, రిపుడౌ
ధనసిద్ధాంతమున కతడు; ధన్వంతరియై!!

100. తే.గీ॥ రెండు చేతులతోఁ జిత్రలేఖనమును
జక్కగా వేయగల సవ్యసాచియతఁడు
మృత్తికాశిల్పరచనను మేటియనఁగ
దేవతాకారముల చాలఁ దీర్చిదిద్దు!!

101. తే.గీ॥ కరమునందునఁగల దొకగరుడ రేఖ
దాన సర్పంబులాతని దారిఁదొలఁగు
నెదుటఁబడినను తలవంచి చెదిరిపోవు;
నట్టియోగమ్ము జగతిలోనరుదుగాదె?

102. తే.గీ॥ గగన మునఁజూచి చక్కగా గణనఁజేసి
రిక్కగతులను, గనిపెట్టి లెక్కఁగట్టి
సమయమెంతయొ తెలుపు పంచాంగ వేత్త
వేంకటార్యుని కళలెన్న వేనవేలు!!

103. ఉత్సాహ॥ చిత్రలేఖనమ్మునన్; ప్రసిద్ధవైద్యమందు,న
క్షత్ర, జోస్య, మంత్ర, పాక శాస్త్రములను దిట్ట, స
న్మిత్రుడౌను జంతువులకు మేలు, కీడులెంచుచున్!
ధాత్రిసత్కళాకరమ్ముతన్మహత్వమూర్తియే!!

104. కం॥ ముప్పదియేండ్లకు పైగాఁ
"కుప్పిలి డాక్టరు"న కొక్క కోవెలమదిలో
నప్పుర వాసులుఁగట్టిరి
చెప్పగ నతిశయముగాదు, చిరసత్యంబౌ!!

105. చం॥ ఎనుబదినొక్క వత్సరములేక పథంబున సాగెనా రథం
బున విరిబాటలుండినను ముళ్ళను, రాళ్ళను కొల్లలక్కటా!
పెనుసుడిగాలులాదిగను భీకర సంఘటనల్ తరించి, తా
దినదిన మొక్క వర్షమను తీరునజీవపయోధినీదెనే!!

106. ఉ॥ వ్యాధుల మాపునట్టి గురువైద్యునకక్కట! కష్టకాలమై
బాధను గూర్చెనే ముదిమివ్యాధిగ పైబడి; యంతవానికిన్
నాథుఁడు లేడ! యార్తిఁగన, నమ్మియుఁజేరెను రామనామమే
సాధనమంచునెంచి మనసార జపించుచు "కేజిహెచ్చి"లోన్.

107. కం॥ పుష్పకమున ధన్వంతరి
పుష్పమ్ములఁదెచ్చి "వైద్యపుంగవ"! యచటన్
గీష్పతిమూర్ఛిల్లెననెన్
బాష్పంబుల రాల్చి, పిలిచె వైద్యమ్మునకై!!

108. కం॥ కననది సెప్టెంబరు నెల
దినముల్ పదిహేను గడిచె, దినమణి పొడిచెన్!
దనుచదివిన గుడియెడిలో
కనుమూసెను రావుగారు, కాయము విడిచెన్

ఆ.వె. అంతనంతరాత్మ యాత్రమ్ము తోడఁ దా
నున్న రీతి నురికి మిన్నుఁజేరె!
దేవగురుని వెండి దీప్తిల్లగాఁజేసి
యబ్జగర్భులోకమందె నిలిచె!!

తే.గీ॥ ఆర్య ఋషిసంప్రదాయమ్ము ననుసరించి
జీవనమ్ము సాగించి విశిష్ట గతి()
ముందు తరములకాదర్శ మూర్తివైన
వేంకటార్యుండ! నీకు వేవేలనతులు!!

కం॥ మీ సంతానము పదుగురు
నా సంఖ్య శతమ్ము దాటె సభ్యున్నతితో!
వాసియు, వన్నెయుఁ దరుగక
భాసురమై కీర్తి నంది వరలుచునుండెన్!!

కం॥ మనుమలు, మునిమనుమలతో
మనుచున్ మీ యార్జవంపు మహిమఘటిల్లన్
గొనకొని సాగించుచు జీ
వనమును సుఖశాంతులమర వర్ధిలుచుండెన్!!

కీ॥శే॥ డా॥ రాంభట్ల వేంకటరావ్వ, సూర్యకాంతమ్మ
దంపతుల ప్రపౌత్రుడును

శ్రీ పార్వతీశ్వర శర్మ, (స్వర్గీయ) ధనలక్ష్మి దంపతుల
పౌత్రుడును

శ్రీ లక్ష్మి నృసింహ సోమయాజులు, సూర్యకాంతకామేశ్వరి
దంపతుల ద్వితీయ పుత్రుడును

అగు "అష్టావధాని" చి॥ రాంభట్ల పార్వతీశ్వర శర్మ" చే
ప్రణీతంబైన

"శ్రీ రాంభట్ల వేంకటీయం"
అను లఘు కావ్యం సమస్తము సంపూర్ణం.

మంగళమ్ మహత్
ఓం శాంతిః శాంతిః శాంతిః

శ్రీమతి [illegible] సూర్యకాంత కామేశ్వరి

[illegible]122394
[illegible]5243171

ఎస్.వి.వి. వివాహ పరిచయ వేదిక

మీ అమ్మాయికి లేదా అబ్బాయికి తగిన వివాహ సంబంధం కొరకు మీరు కోరిన అర్హతలతో మీకు పరిచయం చేయబడును.

మెయిన్ రోడ్, ప్రహ్లాదపురం, విశాఖపట్నం - 530 027.

R.L.N. Somayajulu
D.M.L.T.

9985243171
9393122394

వృద్ధులకు ఇంటికి వచ్చి
రక్తము సేకరించబడును.

S.V.V. CLINICAL LABORATORY

Main Road, Prahladapuram, Visakhapatnam - 530 027.

9440954857

శ్రీ టి.వి.ఎల్. నర్సింగరావు
సహజ జ్యోతిష పండితులు

శ్రీ వెంకటేశ్వర కామేశ్వరి జ్యోతిషాలయం

జాతక ఫలితములు, ముహూర్తములు, ప్రశ్నలు, వాస్తు చెప్పబడును

1-6-21, రామకృష్ణానగర్, ఆర్.టి.సి. కాంప్లెక్స్ దరి, శ్రీకాకుళం

S.V.S. GA[illegible]ATRI

Offset [illegible]rinters

- Multi Co[illegible]our
- Offset
- Screen
- All type of Binding Works

VIJAY
9247426486

S.V.S.

[illegible]IDEO & PHOTO MIXING

An Creative Video Coverage

కవి పరిచయం

పేరు	: "అష్టావధాని" రాంభట్ల పార్వతీశ్వర శర్మ
జననం	: 09-12-1988
జన్మస్థలం	: శ్రీకాకుళం
తలిదండ్రులు	: శ్రీమతి సూర్యకాంత కామేశ్వరి "అక్షరలక్ష గాయత్రీ మంత్రోపసాకులు" శ్రీ లక్ష్మీనృసింహ సోమయాజులు
ప్రాధమిక విద్య	: కొత్తూరు, శ్రీకాకుళం జిల్లా
మాధ్యమిక విద్య	: మల్కాపురం హైస్కూలు, విశాఖపట్నం.
ఉన్నత విద్య	: ఇంటర్మీడియట్ (MLT) ప్రభుత్వ జూనియర్ కళాశాల, పెందుర్తి B.Sc. (Micro Biology) డా॥ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మద్దిలపాలెం, విశాఖపట్నం.
అముద్రిత గ్రంథాలు	: అష్టావధాన పూరణ పద్యాలు, భావకవితా సంపుటి
రేడియో ప్రసారాలు	: నేటి యువత (పద్యాలు) (డా॥ వి.ఎస్. కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల కదంబ కార్యక్రమం)
పురస్కారములు	: రాష్ట్రస్థాయి "పద్యరచన" పోటీలలో (అక్టోబర్, 2006-హైదరాబాద్) ప్రథమ స్థానం మరియు జాతీయ స్థాయికి ఎంపిక
మా విలాసం	: డో.నెం. 12-132, సత్యానగర్, చినముషిడివాడ, విశాఖపట్నం - 531173. సెల్ : 9247859580